RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu



# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ప్రచురణ : హైదరాబాద్, రంగారెడ్డి, సంపుటి 01, సంచిక 151, సంపాదకులు :, పేజీలు -4 మంగళవారం - 20 - ఆగష్టు - 2024 , వెల రూ.2/-

## అమెరికాకే కాదు.. మనకీ ఉన్నాయి మిలటరీ బేస్‌లు




ఢిల్లీ: అమెరికా, రష్యా, చైనా వంటి దేశాలు మిత్ర దేశాల్లో సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకుంటాయి. ఒకవేళ ఏదైనా దేశంతో యుద్ధం చేయాల్సి వస్తే సొంత భూభాగంతోపాటు ఆయా దేశాల నుంచి కూడా శత్రువులను టార్గెట్ చేయొచ్చన్న ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేసుకుంటాయి. అక్కడ తమ సైన్యాన్ని మోహరించి

## త్రిపుల్ తలాక్ ఆచారం ప్రమాదకరం.. సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్



ఢిల్లీ:: ఇస్లాం మతంలోని త్రిపుల్ తలాక్ ఆచారం ముస్లిం మహిళల పరిస్థితిని దయనీయంగా మార్చిందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ మేరకు సోమవారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. త్రిపుల్ తలాక్ ఆచారం వివాహమనే సామాజిక సంప్రదాయానికి ప్రమాదకరంగా మారిందని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో వివరించింది. సుప్రీంకోర్టు 2017లో ఈ ఆచారాన్ని రాజ్యాంగ విరుద్ధమని పేర్కొందని,

## ఉక్రెయిన్ పర్యటనకు ప్రధాని మోదీ.. స్పష్టతనిచ్చిన విదేశాంగ శాఖ

ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో ఉక్రెయిన్‌లో పర్యటించనున్నట్లు గత కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ప్రచారంపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ సోమవారం స్పందించింది. మోదీ ఉక్రెయిన్‌లో పర్యటించనున్నట్లు స్పష్టం చేసింది. అయితే, అందుకు సంబంధించిన వివరాలు మాత్రం వెల్లడించలేదు. మోదీ పర్యటన వివరాలను త్వరలోనే పంచుకుంటామని తెలిపింది. అయితే, ఈ నెలలోనే



## లేటరల్ ఎంట్రీతో రిజర్వేషన్లకు తూట్లు




మోదీ సర్కార్‌పై భగ్గుమన్న విపక్షం

రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి బహుజనుల నుంచి రిజర్వేషన్లను లాగేసుకోవాలని బీజేపీ కోరుకుంటుంది

లేటరల్ ఎంట్రీ దళితులు, ఓబీసీలు, మైనారిటీల నుంచి రిజర్వేషన్లను లాగేసుకునేందుకే

# సింఘ్వీ ఎన్నిక తెలంగాణకు ఎంతో అవసరం..

- సీఎం రేవంత్ ఆసక్తికర వ్యాఖ్యలు..
- తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు
- రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపలేదు
- తనను గెలిపిస్తే తెలంగాణ వాయిస్‌ను రాజ్యసభలో బలంగా వినిపిస్తానన్నారు



హైదరాబాద్: తెలంగాణలో మరో ఎన్నికల కోలాహలం మొదలైంది. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ సింఘ్వీ.. సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. బలమైన గొంతుకైన సింఘ్వీ ఎన్నిక తెలంగాణకు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు సీఎం రేవంత్ రెడ్డి. గచ్చిబౌలిలోని మిగతా..2లో

## రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా?



- అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటు
- ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నాం
- ఏం చేయాలో తెలియక చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారు
- ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నారు

## తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారు



- రాజీవ్ విగ్రహం పెట్టడమంటే.. తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసినట్లే..
- రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదు
- తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోంది

## ఒళ్లు జలదరించేలా కోల్‌కత్తా డాక్టర్ అటాప్సీ రిపోర్ట్



ఒళ్లంతా 14 లోతైన గాయాలు, మర్మాంగాన్ని ఛిద్రం చేసి హత్య -

కోల్‌కత్తా: కోల్‌కత్తా ట్రైనీ డాక్టర్ నరకయాతన అనుభవించి చనిపోయిందని అటాప్సీ రిపోర్ట్ స్పష్టం చేసింది. ఆగస్టు 9వ తేదీన ఆర్జీ కార్ హాస్పిటల్లో హత్యాచారానికి గురైంది. చనిపోయే ముందు ఆమెని ఎన్ని చిత్రహింసలకు గురి చేశారని రిపోర్ట్ తేల్చి చెప్పింది. శరీరమంతా లోతైన గాయాలయ్యాయి. ఇప్పటికే పోస్ట్మార్టం రిపోర్ట్పై చర్చ జరుగుతుండగా ఇప్పుడు మరి కొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. గొంతు పిసికి ఊపిరాడకుండా చేసి చంపినట్టు నివేదికలో తేలింది. అంతే కాదు. అత్యంత దారుణంగా బలవంతం చేసి మర్మాంగానికి మిగతా..2లో


# ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు

- శ్రీసిటీలో 220 పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం
- పారిశ్రామికవేత్తలు ఉపాధి, సంపద సృష్టిస్తున్నారు
- పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది
- భారత్‌ను ఐటీ.. ప్రపంచ పటంలో నిలుపుతుందని ఆనాడే చెప్పాను



శ్రీసిటీ: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుపతి శ్రీ సిటీ పర్యటనకు విచ్చేశారు. శ్రీ సిటీలో వివిధ కంపెనీల సీఈవోలతో చంద్రబాబు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికవేత్తలు సంపద సృష్టిస్తూ ఉపాధి కల్పిస్తున్నారని కొనియాడారు. ఒకే చోట 30 కంపెనీల ప్రతినిధులతో భేటీ మిగతా..2లో

## తెలంగాణలో మరో ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు



- పెద్దపల్లి, సిద్దిపేట, నారాయణపేటతో పాటు పలు జిల్లాల్లో వర్షాలు
- ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా
- గంటకు 40 కిలోమీటర్ల వరకు గాలులు వీస్తాయని వెల్లడి

## పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష



- రాష్ట్ర సచివాలయం నుంచి పవన్ కల్యాణ్ వీడియో కాన్ఫరెన్స్
- హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు
- ఉపాధి హామీ పథకంపై పవన్ దిశానిర్దేశం

అమరావతి: ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్ శాఖపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. మిగతా..2లో

# ముహూర్తం ఫిక్స్



- టీటీడీ ఛైర్మన్, నామినేటెడ్ పదవులు ఖరారు - అనూహ్య ఎంపిక..!!
- మూడు పార్టీల నేతలు నామినేటెడ్ పదవుల భర్తీ పైన కసరత్తు
- మూడు పార్టీల నుంచి నామినేటెడ్ పదవుల కోసం పెద్ద ఎత్తున పోటీ
- తొలి దశ విడత పోస్టులను ప్రకటించేలా ముహూర్తం ఫిక్స్

అమరావతి: ఏపీ ప్రభుత్వం కీలక ప్రకటనకు సిద్ధమైంది. ప్రఖ్యాత టీటీడీ ఛైర్మన్ తో పాటుగా రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పదవులను ప్రకటించనుంది. ఇప్పటికే మూడు పార్టీల నేతలు నామినేటెడ్ పదవుల భర్తీ పైన కసరత్తు చేసారు. కీలక పదవులను ఖరారు చేసారు. మూడు పార్టీల నుంచి నామినేటెడ్ పదవుల కోసం పెద్ద ఎత్తున పోటీ నెలకొంది. దశల వారీగా పోస్టులను ప్రకటించనున్నారు. తొలి దశ విడత పోస్టులను ప్రకటించేలా ముహూర్తం ఫిక్స్ అయింది.

టీటీడీ ఛైర్మన్ గా

టీటీడీ ఛైర్మన్ పదవి కోసం టీవీ ఛానల్ యజమాని పేరు ఖరారైంది. తొలి నుంచి ఆయన పేరే ప్రముఖంగా వినిపిస్తున్నా.. మిగతా..2లో

# తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారు

హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ఎదుట రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడమంటే తెలంగాణ ఆత్మగౌరవంపై దాడి చేసినట్లేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. రాఖీ వేడుకల్లో పాల్గొన్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలపై ఆయన మండిపడ్డారు. రాజకీయాల్లో అధికారం, పదవులు శాశ్వతం కాదన్నారు. రాష్ట్ర ఆత్మగౌరవాన్నిచాటేలా కేసీఆర్ సచివాలయాన్ని కడితే.. కాంగ్రెస్ సర్కారు రాజీవ్ విగ్రహం చేయడమేంటని ప్రశ్నించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ వ్యవహరిస్తోందని.. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణకు, రాజీవ్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. వందలమంది ప్రాణాలు తీసిన నాయకుడి విగ్రహం పెడతారా ? నిలదీశారు. తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన చోట రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ప్రస్తుతం విగ్రహాన్ని పెట్టినా బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని తేల్చి చెప్పారు. అలాగే, రాష్ట్రంలో రాజీవ్ పేరుతో ఉన్న రింగ్ రోడ్డు, హైదరాబాద్ విమానాశ్రయం సహా ఇతర సంస్థల పేర్లను సైతం మారుస్తామని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణలో ఇందిరా గాంధీ, రాజీవ్ పేర్లతో హైదరాబాద్‌లో చాలానే ఉన్నాయన్న కేటీఆర్.. కాంగ్రెస్ ఇప్పటికైనా మారకుంటే అధికారంలోకి వచ్చాక మారుస్తామని తేల్చిచెప్పారు. ఇప్పటికైనా కాంగ్రెస్ మనసు మార్చుకుని అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌లో పెట్టుకో లేకపోతే జూబ్లీహిల్స్‌లో లేదంటే.. ఇంట్లో పెట్టుకోవాలన్నారు. అంతేగానీ తెలంగాణ తల్లిని అవమానిస్తే ఊరుకోమన్నారు.

# లేటరల్ ఎంట్రీతో రిజర్వేషన్లకు తూట్లు

ఢిల్లీ: లేటరల్ ఎంట్రీ ద్వారా ఉన్నతోద్యోగాల భర్తీ వ్యవహారంపై కాంగ్రెస్ సహా విపక్షాలు భగ్గుమన్నాయి. లేటరల్ ఎంట్రీ విధానం ద్వారా రిజర్వేషన్లకు మోదీ సర్కార్ తూట్లు పొడుస్తోందని దుయ్యబట్టాయి. సర్కార్ వైఖరి దళితులు, ఓబీసీలు, ఆదివాసీలపై దాడేనని విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసి బహుజనుల నుంచి రిజర్వేషన్లను లాగేసుకోవాలని బీజేపీ కోరుకుంటున్నదని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్‌లో మోదీ సర్కార్‌పై విరుచుకుపడ్డారు. దేశ రిజర్వేషన్ విధానానికి ఇది వ్యతిరేకమని లేటరల్ ఎంట్రీని మరో కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ తప్పుపట్టారు. ఈ ప్రభుత్వం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా ఖండిస్తున్నానని, ఇది దేశ పరిపాలనా వ్యవస్థకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. ఇది దేశ రిజర్వేషన్ వ్యవస్థకూ విఘాతమని ప్రమోద్ తివారీ పేర్కొన్నారు. మరోవైపు కేంద్రం తీరును తీవ్రంగా ఆక్షేపించిన ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఈ నిర్ణయాన్ని దేశానికి వ్యతిరేకంగా కేంద్రం చేపట్టిన భారీ కుట్రగా అభివర్ణించారు. లేటరల్ ఎంట్రీ దళితులు, ఓబీసీలు, మైనారిటీల నుంచి రిజర్వేషన్లను లాగేసుకునేందుకేనని ఆయన ఆరోపించారు.

# రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా?

హైదరాబాద్: రుణమాఫీ కాలేదన్న రైతులను అరెస్టులు చేస్తారా అని ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజాపాలన అని ప్రచారం చేసుకుంటూ అప్రజాస్వామిక విధానాలను కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం సిగ్గుచేటని విమర్శించారు. రుణమాఫీ కాలేదని అదిలాబాద్ జిల్లా తలమడుగులో నిరసన తెలియచేస్తున్న రైతులను అరెస్టులు చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసు యాక్ట్ పేరు చెప్పి, జిల్లాలో నిరసనలు, ఆందోళనలు చేయొద్దని పోలీసులు హుకుం జారీ చేయడం హక్కులను కాలరాయడమేనని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా శాంతియుతంగా నిరసన తెలియచేస్తున్న రైతులను ముందస్తుగా అదుపులోకి తీసుకుంటున్నారని, అరెస్టులు చేస్తున్నారని వెల్లడించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని బీఆర్ఎస్ పార్టీ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రైతులు రుణమాఫీ కాకపోవడంతో కలెక్టరేట్లు, వ్యవసాయ కార్యాలయం, బ్యాంకుల చుట్టూ తిరిగి విసిగి వేసారి పోతున్నారని చెప్పారు. ఏం చేయాలో తెలియక చివరకు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్నారని తెలిపారు. అన్ని జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తున్నదని వెల్లడించారు. ప్రభుత్వం రైతుల రుణమాఫీ సమస్యకు పరిష్కారం చూపకుండా, పోలీసులను పురమాయించి గొంతెత్తిన వారిని బెదిరించడం, అణగదొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఒకవైపు రైతుబంధు రాక, మరోవైపు రుణమాఫీ కాక అన్నదాత ఆవేదనలో ఉన్నాడని చెప్పారు. వ్యవసాయ పనులు చేసుకోవాలా లేక రుణమాఫీ కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు చేయాలా అంటూ కన్నీరు పెట్టుకుంటున్నారని వెల్లడించారు. ఏకకాలంలో ఆగస్టు 15లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఆచరణలో మాత్రం అట్టర్ ఫ్లాప్ అయ్యారని ఎద్దేవాచేశారు. నమ్మి ఓటేసినందుకు రైతన్నను నట్టేట ముంచారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎద్దు ఏడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం ఏనాడూ బాగుపడ్డట్లు చరిత్రలో లేదన్న విషయాన్ని కాంగ్రెస్ పాలకులు మరిచిపోయినట్లున్నారని చెప్పారు. ఇప్పటికైనా కండ్లుతెరిచి రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఆందోళనలో ఉన్న రైతాంగానికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని మరోసారి డిమాండ్ చేశారు. అదిలాబాద్ సహా ఇతర జిల్లాల్లో రైతన్నలపై పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే అరెస్టు చేసిన రైతన్నలకు అండగా బీఆర్ఎస్ పార్టీ కార్యచరణ ప్రకటిస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# అమెరికాకే కాదు.. మనకీ ఉన్నాయి మిలటరీ బేస్‌లు

మొదటి పేజి తరువాయి

శత్రువుల కదలికలపై ఓ కన్నేసి ఉంచుతాయి. ఈ విషయంలో అమెరికా ముందుందనే చెప్పాలి. చాలా దేశాల్లో అది మిలటరీ బేస్‌లను ఏర్పాటు చేసింది. అయితే, ఈ విషయంలో భారత్ పేరు ఎప్పుడూ వినిపించలేదు. నిజానికి ఈ విషయంలో భారత్ పేరు ఎన్నడూ బయటకు రానప్పటికీ మనకు కూడా చాలా దేశాల్లో సైనిక స్థావరాలున్నాయి. ఆ బేస్‌ల నుంచి ఇటు చైనా, అటు పాకిస్థాన్‌ను కూడా టార్గెట్ చేయొచ్చు. మరి అవి ఎక్కడున్నాయి? అవి మనకు ఎలా ఉపయోగపడతాయి? అన్న వివరాలను ఈ వీడియోలో చూడండి.

# త్రిపుల్ తలాక్ ఆచారం ప్రమాదకరం.. సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

మొదటి పేజి తరువాయి

అయినా కొంతమంది ముస్లింలలో ఇప్పటికీ ఈ ఆచారం కొనసాగుతోందని అఫిడవిట్ ద్వారా కేంద్రం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. అందువల్ల ముస్లింలలో త్రిపుల్ తలాక్ విడాకుల సంఖ్యను తగ్గించడంలో సుప్రీంకోర్టు తీర్పు ప్రతిబంధకంగా పనిచేయలేదని తెలిపింది. త్రిపుల్ తలాక్ బాధితులు పోలీసులను ఆశ్రయించడం తప్ప మరో మార్గం లేకపోవడం, చట్టంలో శిక్షార్హమైన నిబంధనలు లేకపోవడంతో బాధితుల భర్తలపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని, దాంతో పోలీసులు నిస్సహాయంగా మారారని పేర్కొంది. త్రిపుల్ తలాక్ విడాకులను నిరోధించేందుకు కఠినమైన నిబంధనల అవసరం ఉందని వాదించింది. కాగా త్రిపుల్ తలాక్ విధానం చెల్లుబాటు కాదని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేయలేదని, కాబట్టి త్రిపుల్ తలాక్ విడాకులను నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని పేర్కొంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దాంతో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది.

# ఉక్రెయిన్ పర్యటనకు ప్రధాని మోదీ.. స్పష్టతనిచ్చిన విదేశాంగ శాఖ


మొదటి పేజి తరువాయి

మోదీ కీవ్‌లో పర్యటించనున్నట్లు జాతీయ మీడియా పేర్కొంటోంది. రష్యాతో యుద్ధం తర్వాత ప్రధాని మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి. ఉక్రెయిన్‌పై 2022, ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్య ప్రారంభించింది. మూడు వారాల్లో ఆ దేశంలోని అన్ని ప్రధాన నగరాలను ఆక్రమించుకోవాలని పుతిన్ సైన్యం లక్ష్యంగా పెట్టుకుంది. అయితే ఉక్రెయిన్‌కు నాటో దేశాల మద్దతుతో మూడు వారాలు అనుకున్న యుద్ధం కాస్తా రెండున్నర ఏండ్లుగా కొనసాగుతూనే ఉంది. ఇరు దేశాలు పరస్పరం దాడులు కొనసాగిస్తూనే ఉన్నాయి. దీంతో ఈ యుద్ధానికి ముగింపు ఎప్పుడో తెలియని అనిశ్చితి నెలకొంది. ఈ నేపథ్యంలో సమస్యల పరిష్కారానికి యుద్ధం మార్గం కాదని, చర్చలతోనే శాంతి నెలకొంటుందని రష్యా, ఉక్రెయిన్‌కు ప్రధాని మోదీ పలుమార్లు సూచించారు. ఇక రష్యాతో యుద్ధం తర్వాత ప్రధాని మోదీ ఆ దేశానికి వెళ్లడం ఇదే మొదటిసారి. కొన్ని నెలల కిందట ఇటలీలో జరిగిన జీ7 సమావేశాల సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో మోదీ సమావేశమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లో తాజా పరిస్థితులపై చర్చించారు. అంతకు ముందు భారత్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వరుసగా మూడోసారి విజయం సాధించిన మోదీకి జెలెన్‌స్కీ ఫోన్ ద్వారా అభినందనలు తెలియజేశారు. ఓ సారి ఉక్రెయిన్‌లో పర్యటించాల్సిందిగా మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే ప్రధాని కీవ్ పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. జూన్ 8న ప్రధాని మోదీ రష్యాలో పర్యటించిన విషయం తెలిసిందే. ఇండియా-రష్యా 22వ వార్షిక సమావేశం సందర్భంగా ప్రధానిని రష్యాలో పర్యటించాలని పుతిన్ ఆహ్వానించారు. ఆయన ఆహ్వానం మేరకు మోదీ మాస్కోలో రెండు రోజుల పాటు పర్యటించారు. పుతిన్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. మోదీకి ఆ దేశ అత్యున్నత పౌరపురస్కారాన్ని పుతిన్ అందజేశారు. తన పర్యటన సందర్భంగా పుతిన్‌తో మోదీ ఆలింగనం చేసుకున్నారు. దీనిపై జెలెన్‌స్కీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మోదీ ఉక్రెయిన్ పర్యటనపై ఆసక్తి నెలకొంది.

# ముహూర్తం ఫిక్స్

మొదటి పేజి తరువాయి





టీడీపీ ఏపీ మాజీ అధ్యక్షుడు కళా వెంకటరావు పేర సైతం పరిశీలనలోకి వచ్చింది. అయితే ఉత్తరాంధ్రకు ఇప్పటి వరకు దక్కిన ప్రాధాన్యతతో టీటీడీ ఛైర్మన్ మీడియా సంస్థ అధినేతకే ఇవ్వాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. అదే సమయంలో రాష్ట్ర స్థాయిలో నామినేటెడ్ పదవులను పార్టీ సీనియర్లు.. తాజా ఎన్నికల్లో టికెట్లు దక్కని వారికి కేటాయించాలని నిర్ణయించారు.

పదవులు ఖరారు

నేడు (మంగవారం) తొలి విడత నామినేటెడ్ పదవులను ప్రకటించే అవకాశం కనిపిస్తోంది. టీటీడీ ఛైర్మన్ గా బీఆర్ నాయుడు, డిజిటల్ కార్పోరేషన్ ఛైర్మన్ గా జివి రెడ్డి పేర్లు ఖరారైనట్లు తెలుస్తోంది. అదే విధంగా దేవినేని ఉమాకు ఆర్టీసీ ఛైర్మన్, ప్రవీణ్ కుమార్ రెడ్డికి ఏపీఐఐసీ ఛైర్మన్, పట్టాబికి పౌర సరఫరాల కార్పోరేషన్, మాజీ మంత్రి పీతల సుజాతకు ఎస్సీ కమిషన్, మరో మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కు ఎస్టీ కమిషన్ ఖరారైనట్లు పార్టీలో ప్రచారం సాగుతోంది.

మూడు పార్టీలకు

మాల కార్పోరేషన్ ఛైర్మన్ గా ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ, మాదిగ కార్పోరేషన్ ఛైర్మన్ గా వాసం మునియ్య పేర్లు ఖాయం చేసినట్లు తెలుస్తోంది. ఇక,రాష్ట్రంలో 90 వరకూ కార్పొరేషన్లు ఉండగా వాటి ఛైర్మన్లు అందులో మెంబర్లు కలిసి వందల్లోనే పోస్టులు ఉన్నాయి. ఇవి మొత్తం ఒకేసారి కాకుండా విడతల వారీగా భర్తీ చేయాలని భావిస్తున్నారు. దాదాపు 30 శాతం పదవులు తొలి విడతలోనే భర్తీ చేయనున్నారు. ఇక.. పదవుల పంపకాల్లో మూడు పార్టీలు ఒక ఫార్ములా ప్రకారం పూర్తి చేయాలని నిర్ణయానికి వచ్చాయి.

# సింఘ్వీ ఎన్నిక తెలంగాణకు ఎంతో అవసరం..

మొదటి పేజి తరువాయి



షెర్టాన్ హెూటల్‌లో సీఎల్పీ సమావేశం జరిగింది. తెలంగాణ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీని ఆమోదించినందుకు అధిష్ఠానానికి ధన్యవాదాలు తెలుపుతూ సీఎల్పీ తీర్మానం చేసింది. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, అభిషేక్ మను సింఘ్వీ ఎమ్మెల్యేలు, సీనియర్‌నేతలు హాజరయ్యారు. ఉదయం 11 గంటలకు తెలంగాణ కాంగ్రెస్ తరపున రాజ్యసభ అభ్యర్థిగా అభిషేక్ మను సింఘ్వీ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలుపై కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో శ్రద్ధ చూపలేదన్నారు సీఎం రేవంత్‌రెడ్డి. చట్టంలోని అంశాలను చట్టసభల్లో బలంగా వినిపించాల్సిన అవసరం ఉన్నదో న్యాయస్థానాల్లోనూ అంతే గట్టిగా వాదించాల్సిన అవసరం ఉన్నదన్నారు. విభజన చట్టానికి సంబంధించిన వ్యాజ్యాలపై సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలంగాణ తరఫున గట్టిగా వాదిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు రేవంత్‌రెడ్డి. తెలంగాణ నుంచి రాజ్యసభకు తనకు అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీకి అభిషేక్ సింఘ్వీ ధన్యవాదాలు తెలిపారు. తనను గెలిపిస్తే తెలంగాణ వాయిస్‌ను రాజ్యసభలో బలంగా వినిపిస్తానన్నారు. తెలంగాణ వాయిస్ ను బలంగా వినిపించే గొంతుకైన అభిషేక్ సింఘ్వీకి పార్టీలకు అతీతంగా మద్దతు తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి. తెలంగాణ కోటాలో రాజ్యసభ స్థానానికి సీనియర్ నేత కె.కేశవరావు రాజీనామాతో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో రాజ్యసభ ఉప ఎన్నిక సెప్టెంబర్ 3న జరగనుంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ పోటీ చేస్తున్నారు.

# ప్రపంచంలో ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు

ప్రతినిధులతో భేటీ గొప్ప విషయం అని, ఇదొక అపూర్వ ఘట్టం అని పేర్కొన్నారు. పరిశ్రమల ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుందని అన్నారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు మొదలయ్యాయని, తాను గతంలో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పెట్టుబడులు రాబట్టేందుకు అనేక దేశాల్లో పర్యటించానని చంద్రబాబు వెల్లడించారు. భారత్ ను ఐటీ రంగం ప్రపంచపటంలో నిలుపుతుందని ఆనాడే చెప్పానని గుర్తుచేశారు. ప్రపంచంలో ఏ దేశానికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారని, ప్రపంచంలోని ప్రతి నలుగురు ఐటీ నిపుణుల్లో ఒక భారతీయుడు ఉంటారని, ప్రతి నలుగురు భారతీయ ఐటీ నిపుణుల్లో ఒకరు ఏపీ వ్యక్తి ఉంటారని వివరించారు. అదీ ఏపీ సత్తా అని పేర్కొన్నారు. దేశంలో హైదరాబాదులో అత్యుత్తమ మౌలిక సదుపాయాలు ఉన్నాయని చంద్రబాబు తెలిపారు. హైదరాబాద్ ప్రజల నివాసాలకు అనుకూల ప్రాంతంగా ఉందని పేర్కొన్నారు. గతంలో పీపీపీ విధానంలో హైటెక్ సిటీ నిర్మాణం చేపట్టామని తెలిపారు. శ్రీ సిటీలో 8 వేల ఎకరాల్లో పారిశ్రామిక జోన్లు ఏర్పాటయ్యాయని, ఇక్కడ సెజ్, డొమెస్టిక్ జోన్, ఫ్రీ ట్రేడ్ జోన్ ఏర్పాటయ్యాయని వివరించారు. ఇప్పటికే శ్రీ సిటీ నుంచి 220 కంపెనీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయని... ఇక్కడ ఆటోమేటివ్, ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు కూడా వచ్చాయని అన్నారు. 4.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల సాధన గొప్ప విషయం అని, 4 బిలియన్ డాలర్ల ఎగుమతులు సాధించడం మామూలు విషయం కాదని చంద్రబాబు తెలిపారు. చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీ సిటీ దగ్గరగా ఉందని, శ్రీ సిటీని అత్యుత్తమ ఎకనామిక్ జోన్ గా అభివృద్ధి చేయాలనేది తన ఆలోచన అని స్పష్టం చేశారు. శ్రీ సిటీకి ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. శ్రీ సిటీకి అన్ని రకాల మౌలిక సౌకర్యాలు ఉన్నాయని, దీన్ని అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మార్చుతామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. శ్రీ సిటీలో సహజంగానే చల్లని వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కంపెనీలు వీలైనంతగా ఉత్పత్తి, లాజిస్టిక్స్ ఖర్చులు తగ్గించుకోవాలని... ఈ ధరల తగ్గింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఏపీ రాజధాని అమరావతి ప్రస్తావన తెచ్చారు. కొత్త రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నామని, రాజధాని నిర్మాణం కోసం 29 వేల మంది రైతులు 34 ఎకరాల భూమిని ఇచ్చారని వెల్లడించారు. ఇంటింటికీ తాగునీరు, విద్యుత్, ఫైబర్ నెట్ అందిస్తున్నామని... మున్ముందు గ్యాస్ తో పాటు ఏసీ కూడా పైప్ లైన్ల ద్వారా ఇంటింటికీ అందిస్తామని చంద్రబాబు తెలిపారు. పారిశ్రామికవేత్తలు వినూత్న ఆలోచనలతో ముందుకురావాలని కోరుతున్నానని పిలుపునిచ్చారు. 2029 నాటికి భారత్ మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ధీమా వ్యక్తం చేశారు. తాము విజన్-2047 ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. 2047 నాటికి భారత్ నెంబర్ వన్, లేదా నెంబర్ టూ స్థానంలో ఉంటుందని జోస్యం చెప్పారు.

గోల్డెన్ రేటింగ్ కోసం కృషి

చెన్నై, కృష్ణపట్నం, తిరుపతి ప్రాంతాలకు శ్రీసిటీ దగ్గరగా ఉందని చంద్రబాబు అన్నారు. శ్రీసిటీని అత్యుత్తమ ఎకనమిక్ జోన్‌గా తయారు చేయాలనేది తన ఆలోచనని చెప్పారు. " శ్రీసిటీ ఐజీబీసీ గోల్డెన్ రేటింగ్ గుర్తింపు వచ్చేలా కృషి చేస్తున్నాం. పచ్చదనం కోసం వందశాతం వర్షం నీటి సంరక్షణకు చర్యలు తీసుకుంటాం. శ్రీసిటీకి అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఉన్నాయి. అత్యంత అనుకూల నివాసయోగ్య ప్రాంతంగా మారుస్తాం. సహజంగా చల్లనివాతారవణం కల్పనకు చర్యలు తీసుకుంటాం. వీలైనంత వరకు ఉత్పత్తి, లాజిస్టిక్ ధరలు తగ్గించుకోవాలి. ఆ దిశగా ప్రభుత్వం కూడా చర్యలు చేపడుతుంది.

# ఒళ్లు జలదరించేలా కోల్‌కత్తా డాక్టర్ అటాప్సీ రిపోర్ట్

మొదటి పేజి తరువాయి

గాయమయ్యేలా పాశవికంగా ప్రవర్తించినట్టు రిపోర్ట్ వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం శరీరం మొత్తం మీద 14 గాయాలయ్యాయి. ముఖం, తల, మెడ, చేతులు, ప్రైవేట్ పార్ట్స్..ఇలా అన్ని చోట్లా గాయాలు కనిపించాయి. బలవంతంగా గొంతు నులిమి విలవిలలాడి ప్రాణాలు కోల్పోయేలా చేసినట్టు నివేదికలో వెల్లడైంది. ఇది కచ్చితంగా హత్యేనని స్పష్టం చేసింది. ఊపిరితిత్తుల నుంచి తీవ్ర రక్తస్రావమైందని, పలు చోట్ల రక్తం గడ్డ కట్టుకుపోయిందని రిపోర్ట్ పేర్కొంది. అయితే..ఎక్కడా ఫ్రాక్చర్స్ కాలేదని వెల్లడించింది. బ్లడ్తో పాటు శరీరంలో గుర్తించిన ఇతరత్రా ఫ్లూయిడ్ శాంపిల్స్ని అనాలసిస్కి పంపించారు.

సీబీఐ విచారణ..

ఆగస్టు 9వ తేదీన ఈ దారుణంగా జరగ్గా ఇప్పటి వరకూ కేసులో ఎలాంటి పురోగతి కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. హైకోర్టు ఈ కేసు విచారణను సీబీఐకి బదిలీ చేసింది. అన్ని కోణాల్లోనూ ఇన్వెస్టిగేషన్ చేస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కాలేజ్ మాజీ ప్రిన్సిపల్నీ విచారిస్తున్నారు. బాధితురాలి తల్లిదండ్రులు న్యాయం జరుగుతున్న నమ్మకంతో ఉన్నారు. అటు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ ఘటనకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. దీనిపైనా రాజకీయంగా దుమారం రేగుతోంది. ముఖ్యమంత్రే ఇలా ర్యాలీ చేయడమేంటని మండి పడుతున్నారంతా. బెంగాల్కి హెూం మంత్రి కూడా దీదీయే. (

దీదీపై విమర్శలు..

ఇలాంటి దారుణాలు జరగకుండా శాంతి భద్రతల్ని కాపాడాల్సింది పోయి...ఇలా అందరిలా ర్యాలీ ఎందుకు చేసినట్టు అని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ కేసుని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించింది. త్వరలోనే విచారణ చేపట్టనుంది. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఈ కేసుని విచారించనుంది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఈ ఘటనను నిరసిస్తూ 24 గంటల పాటు ఆందోళనలు చేశారు. వైద్య సేవలను బహిష్కరించారు. వైద్యులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఈ నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.

# 'హాలీవుడ్‌కు పోటీ ఇచ్చాడు'.. ప్రభాస్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రశంసలు జల్లు..




హైదరాబాద్: పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ రేంజ్ రోజురోజుకీ పెరిగిపోతోంది. బాహుబలితో వరల్డ్ వైడ్ గా పాపులర్ అయిన డార్లింగ్ ఇప్పుడు సలార్, కల్కి సూపర్ హిట్స్ తో క్రేజ్ లో నెక్ట్స్ లెవెల్ కి వెళ్లిపోయాడు. ఇంటర్నేషనల్ స్టార్స్ సైతం ప్రభాస్ నటన, పాపులారిటీపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభాస్ ను ఆకాశానికెత్తేశారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ లో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన ప్రభాస్ పై ఆసక్తికర కామెంట్స్ చేశారు. ' దేశంలో పలు రంగాల అభివృద్ధిలో క్షత్రియుల పాత్ర ఎంతో ఉంది. సినీ రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన వ్యక్తుల్లో కృష్ణం రాజు ఒకరు. ఆయన పేరు లేకుండా తెలుగు పేరు చెప్పలేం. కృష్ణంరాజు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఇక హాలీవుడ్‌కి పోటీ ఇచ్చిన 'బాహుబలి' ని ప్రభాస్ లేకుండా ఊహించలేం' అని చెప్పుకొచ్చారు రేవంత్ రెడ్డి. ఇదే సందర్భంగా సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆర్జీవీ తనకు మంచి మిత్రుడంటూ ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం సీఎం రేవంత్ కామెంట్స్ కు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ఇక ల విషయానికి వస్తే.. గతేడాది సలార్ తో సూపర్ హిట్ కొట్టిన ప్రభాస్.. రీసెంట్ గా కల్కితో మరో ఇండస్ట్రీ హిట్ ను తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం హను రాఘవపూడి దర్శకత్వంలో ఓ చేస్తున్నాడు డార్లింగ్. అలానే మారుతితో కలిసి ది రాజా సాబ్, నాగ్ అశ్విన్ తో కలిసి కల్కి 2, ప్రశాంత్ నీల్ తో సలార్ 2, సందీప్ రెడ్డి వంగాతో కలిసి స్పిరిట్ లను లైన్ లో పెట్టాడు.

# పంచాయతీరాజ్ శాఖపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష




పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కమిషనర్ కృష్ణతేజ, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, 26 జిల్లాల జడ్పీ సీఈవోలు, డీపీవోలు, డ్వామా పీడీలు, ఎంపీడీవోలు, ఈవో పీఆర్డీలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం ఏపీవోలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టాల్సిన పనుల ఆమోదం కోసం గ్రామ సభ నిర్వహణ, అందుకు సంబంధించిన విధి విధానాలపై పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. ఈ నెల 23న రాష్ట్రంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామ సభల నిర్వహణ చేపట్టాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పరిధిలో 46 రకాల పనులు చేపట్టవచ్చని అన్నారు. ఈ పథకం ద్వారా వేల కోట్ల రూపాయల నిధులు ఖర్చు చేస్తున్నామని, ప్రతి రూపాయిని బాధ్యతతో ఖర్చుపెట్టాలని, ఉపాధి హామీ పథకం లక్ష్యం అందుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా స్థాయి అధికారుల నుంచి, మండల, గ్రామ స్థాయిలో ఉన్న అధికారుల వరకు ఈ పథకం అమలులో బాధ్యత తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సోషల్ ఆడిట్ విభాగం పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు.

# తెలంగాణలో మరో ఐదు రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు



హైదరాబాద్: తెలంగాణలో మరో ఐదు రోజులు తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. నేటి నుంచి రేపటి వరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూలు, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశముందని వెల్లడించింది. పలుచోట్ల ఉరుములు మెరుపులతో కూడిన గాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని తెలిపింది. మంగళవారం నుంచి బుధవారం వరకు పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. ఆదిలాబాద్, కొమురంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసే అవకాశముందని తెలిపింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. బుధవారం నుంచి గురువారం వరకు రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గురువారం నుంచి శనివారం వరకు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

# ఈనెల 21న భారత్ బంద్.. స్కూల్స్, దుకాణాలు అన్నీ మూత?




ఢిల్లీ : దేశంలో వివిధ సమస్యలపై తీవ్ర ఆందోళనలు జరుగుతున్న విషయం తెలిసిందే. మణిపూర్ అల్లర్లతోపాటు పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్ హత్యాచార సంఘటనతో దేశంలో పెద్ద ఎత్తున నిరసనలు వ్యాపిస్తున్నాయి. ఇక రైతులు కూడా తమ డిమాండ్‌లపై మరోసారి తీవ్రస్థాయిలో ఉద్యమం నడిపేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలోనే మరో ఉద్యమం రాజుకుంటోంది. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఉద్యమిస్తామని ఓ సంఘం ప్రకటించింది. అందులో భాగంగా భారత్ బంద్‌కు ఆ సంఘం పిలుపునిచ్చింది.

21న భారత్ బంద్


ఎస్సీ,ఎస్టీ విభజన, క్రిమిలేయర్ మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి తెలిపింది. కుట్రపూరితంగా ఎస్సీ, ఎస్టీల్లో విబేధాలు సృష్టించడానికి వర్గీకరణను తీసుకొచ్చారని ఆ సమితి ఆరోపించింది. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తాము పోరాటాలు చేస్తామని ప్రకటించింది. అందులో భాగంగా ఆగస్టు 21వ తేదీన దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశమైంది. ఆ సమితియాల కన్వీనర్ సర్వయ్య మాట్లాడుతూ.. ఎస్సీలు, ఎస్టీలను రాజ్యాధికారానికి దూరం చేసే కుట్రతో కేంద్ర ప్రభుత్వం వర్గీకరణ కుట్ర చేసిందని మండిపడ్డారు. ఇది సుప్రీంకోర్టు తీర్పు కాదు అని ఇది బీజేపీ, నరేంద్ర మోదీ తీర్పు అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సోదరులు ఇప్పటికైనా మేల్కొని వర్గీకరణ వ్యతిరేక నినాదంతో పెద్ద ఎత్తున భారత్ బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. భారత్ బంద్‌తో ఎస్సీ, ఎస్టీల ఐక్యతను కేంద్ర ప్రభుత్వానికి చూపించాలని సూచించారు.

# ప్రభాస్ పై సీఎం రేవంత్ ప్రశంసల వర్షం..!



హైదరాబాద్: కష్టపడే గుణం వల్ల క్షత్రియులు ఎక్కడైనా విజయం సాధిస్తారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. విజయానికి, నమ్మకానికి క్షత్రియులు మారు పేరు అన్నారు. ఇదే సామాజిక వర్గానికి చెందిన ప్రభాస్ తెలుగు సినిమా ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేశారని ప్రశంసించారు. అలాగే హైదరాబాద్ అభివృద్ధిలో రాజుల పాత్ర కూడా ఉందన్నారు. కొంపల్లిని పెద్ద నగరంగా చేసింది క్షత్రీయులే అన్నారు. మీడియా రంగంలో రాజులే రాణిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే కృష్ణంరాజు పేరు లేకుండా తెలుగు సినిమా పేరు చెప్పలేమన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధకరం అన్నారు. బాలీవుడ్ లో సత్తా చాటిన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ కూడా తనకు మంచి మిత్రుడు. హాలీవుడ్ రేంజ్ సినిమా ప్రభాస్ లేకుండా ఊహించలేమన్నారు. రాజులను చట్టసభల్లోకి తీసుకుపోవాలనే ఆలోచన ఉంది. తొలుత పార్టీలో అవకాశం ఇస్తాం.. ఆ తరువాత ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తామని మాట ఇస్తున్నట్టు తెలిపారు.

# తెలంగాణ తెరపై ఇక కొత్త నేత



హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో మరో కొత్త నాయకుడి పేరు తెరమీదికి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అభిషేక్ మను సింఘ్వీ రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ దీపా దాస్ మున్షీ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించిన ప్రతిపక్ష భారత్ రాష్ట్ర సమితి మాజీ సెక్రెటరీ జనరల్ కే కేశవరావు తన సభ్యత్వానికి రాజీనామా చేయడం వల్ల ఈ ఎన్నిక అవసరమైంది. తన పదవికి, బీఆర్ఎస్ ప్రాథమిక సభ్యత్వానికీ రాజీనామా చేసిన కేకే.. కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కేశవరావు రాజ్యసభ పదవీ కాలం 2026 ఏప్రిల్ 9వ తేదీ వరకు ఉంది. ఆయన రాజీనామా వల్ల ఖాళీ అయిన ఈ స్థానంలో అభిషేక్ మను సింఘ్వీని నామినేట్ చేసింది అఖిల భారత కాంగ్రెస్ కమిటీ. ఆయన అభ్యర్థిత్వాన్ని రెండు రోజుల కిందటే అధికారికంగా ప్రకటించింది. ఆదివారమే ఆయన హైదరాబాద్‌కు చేరుకున్నారు. రేవంత్ రెడ్డి సహా పార్టీకి చెందిన సీనియర్ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. కొద్దిసేపటి కిందటే మను సింఘ్వీ.. తన నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఈ నెల 21 చివరి తేదీ. 22న నామినేషన్లను స్క్రూటినీ చేస్తారు. సెప్టెంబర్ 3వ తేదీన పోలింగ్ ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. అదే రోజున సాయంత్రం 5 గంటలకు ఓట్లను లెక్కిస్తారు. 6వ తేదీ నాటికి ఈ ఎన్నికల ప్రక్రియ మొత్తం పూర్తవుతుందని ఈసీ ఈ షెడ్యూల్‌లో వివరించింది. తెలంగాణతో పాటు మొత్తం 12 రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల కమిషన్ ఇదివరకే విడుదల చేసింది. ఎన్నికలను ఎదుర్కొనాల్సి ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణతో పాటు అస్సాం, బిహార్, హర్యానా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, త్రిపుర, ఒడిషా ఉన్నాయి. అస్సాం- కామాఖ్య ప్రసాద్ టాసా, సర్బానంద సొనోవాల్, బిహార్- మీసా భారతి, వివేక్ ఠాకూర్, హర్యానా- దీపేందర్ సింగ్ హుడా, మధ్యప్రదేశ్- జ్యోతిరాదిత్య సింధియా, మహారాష్ట్ర- ఉదయరాజె భోంస్లే, పియూష్ గోయెల్, కేసీ వేణుగోపాల్- రాజస్థాన్, తెలంగాణ- కే కేశవరావు, ఒడిశా- మొహంతామమత పదవులు ఖాళీ అయ్యాయి. కేశవరావు, మమత మొహంతా తమ పదవులకు రాజీనామా చేయడం వల్ల ఎన్నికలు అవసరం అయ్యాయి. మిగిలిన వారంతా కూడా మొన్నటి ఎన్నికల్లో విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆయా కారణాల వల్ల రాజ్యసభలో ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాల్సి వచ్చింది.

# పవన్ కల్యాణ్ టాప్ ప్రయారిటీ అదే

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం- జనసేన- భారతీయ జనతా పార్టీ సంకీర్ణ కూటమి ప్రభుత్వం.. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్.. ఉండవల్లిలోని తన అధికారిక నివాసంలో ప్రతి శనివారం ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తూ వస్తోన్నారు. ప్రజలను ముఖాముఖిగా కలుసుకుంటోన్నారు. స్థానికంగా వారు ఎదుర్కొంటోన్న సమస్యలను అడిగి తెలుసుకుంటోన్నారు. వాటిని పరిష్కరించేలా అక్కడికక్కడే ఆదేశాలను జారీ చేస్తోన్నారు. పవన్ కల్యాణ్.. జనవాణి పేరుతో ఇలాంటి కార్యక్రమాన్నే చేపట్టారు. కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చేబ్రోలులో గల పవన్ కల్యాణ్ ఇంటి వద్ద ఈ ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ఆరంభమౌతుంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుంది. ఈ అయిదు రోజులూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తారు. దీనికోసం పవన్ నివాసంలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేశారు. హెల్ప్ డెస్క్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను పవన్ కల్యాణ్‌కు అందజేస్తారు. అధికారంలో లేనప్పుడు కూడా పవన్ కల్యాణ్.. ఈ జనవాణి కార్యక్రమాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. తిరుపతి, మంగళగిరి, భీమవరం, విశాఖపట్నం, కాకినాడ, మచిలీపట్నం.. వంటి పలు నగరాల్లో దీన్ని ఏర్పాటు చేశారు. ప్రజలను నేరుగా కలుసుకున్నారు. అధికారంలో లేకపోయినా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత ఏర్పాటు కానున్న రెండో జనవాణి కార్యక్రమం ఇది. అధికారంలోకి వచ్చిన తొలి రెండు వారాల వ్యవధిలోనే దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు పవన్ కల్యాణ్. ఉప ముఖ్యమంత్రి హోదాలో మంగళగిరిలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. దీన్ని మరింత విస్తృతం చేసేలా చర్యలు తీసుకుంటోన్నారు.

# "ఆ బిల్లుకు మోక్షం కల్పించండి".. ప్రధానికి పద్మ అవార్డులు పొందిన వైద్యుల లేఖ




"వైద్యో నారాయణో హరి" అంటూ వైద్యులను దైవంతో సమానంగా కొలిచే దేశం మనది. కోవిడ్-19 మహమ్మారి విరుచుకుపడి ప్రాణాలు బలితీసుకుంటున్న సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా వైద్యులు అందించిన సేవలు ప్రతి ఒక్కరికీ గుర్తుండే ఉంటుంది. తల్లి జన్మనిస్తే.. వైద్యులు పునర్జన్మనిస్తారు. ప్రజల ప్రాణాలు కాపాడే మహోన్నత వృత్తిలో ఉన్న వైద్యుల ప్రాణాలకే రక్షణ లేని పరిస్థితులు దేశంలో ఆందోళన కల్గిస్తున్నాయి. కోల్‌కత్తాలో 31 ఏళ్ల సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారం, హత్య ఘటన యావత్ ప్రపంచాన్నే 'షాక్'కి గురిచేసింది. దేశవ్యాప్తంగానే కాదు, ప్రపంచవ్యాప్తంగానూ వైద్యలోకం గళమెత్తింది. ఈ క్రమంలోనే వైద్యరంగంలో పద్మ అవార్డులు అందుకున్న పలువురు ప్రఖ్యాత వైద్యులు ప్రధానమంత్రికి లేఖ రాశారు. హెల్త్‌కేర్ నిపుణులు, సిబ్బంది రక్షణ కోసం చట్టం తీసుకురావాలని కోరారు. మహిళలు, బాలికలు, హెల్త్‌కేర్ నిపుణులపై జరుగుతున్న హింస, లైంగిక దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. కోల్‌కత్తా ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో హత్యాచారానికి గురైన సీనియర్ రెసిడెంట్ డాక్టర్ కుటుంబానికి సానుభూతి, సంఘీభావం ప్రకటించారు. అలాగే ఆందోళన బాట పట్టిన వైద్యలోకానికి బాసటగా నిలుస్తున్నామని వెల్లడించారు. ఈ క్రమంలో 5 ప్రధాన డిమాండ్లను ప్రధాన మంత్రి ముందు పెట్టారు. 01. ప్రస్తుత చట్టాలను కఠినంగా అమలు చేయాలి: దేశవ్యాప్తంగా వైద్యులపై దాడుల ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో ఇప్పటికే ఉన్న చట్టాలను కఠినంగా అమలు చేస్తూ వారికి రక్షణ కల్పించాలి. 02. లైంగిక నేరాలకు పాల్పడేవారిని నిర్ణీత కాలవ్యవధిలో కఠినంగా శిక్షించాలి: వైద్యులపై లైంగిక వేధింపులు, దాడులు, అత్యాచారం వంటి నేరాలకు పాల్పడేవారిపై వేగంగా చర్యలు చేపట్టాలి. నిర్ణీత కాలవ్యవధిలోగా వారికి కఠిన శిక్ష పడేలా చూడాలి. 03. ఆస్పత్రుల్లో, వైద్య రంగ సంస్థల్లో మెరుగైన భద్రత: దేశవ్యాప్తంగా ఉన్న ఆస్పత్రులు, వైద్యారోగ్య సంస్థల్లో పనిచేసే సిబ్బందికి మరింత మెరుగైన భద్రత కల్పించాలి. ఆ మేరకు సేఫ్టీ ప్రొటోకాల్స్ రూపొందించడం లేదా మరింత మెరుగుపర్చడం చేయాలి. ఈ తరహా నేరాలు జరగకుండా నిరోధించాలి 04. ప్రత్యేక చట్టాన్ని రూపొందించాలి: వైద్యులు, ఇతర హెల్త్‌కేర్ నిపుణులు, సిబ్బంది రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. వైద్యరంగ సిబ్బంది రక్షణ కోసం "ది ప్రివెన్షన్ ఆఫ్ వయోలెన్స్ ఎగెనెస్ట్ డాక్టర్స్, మెడికల్ ప్రొఫెషనల్స్ అండ్ మెడికల్ ఇన్‌స్టిట్యూషన్స్ బిల్" పేరుతో ప్రతిపాదించిన బిల్లు 2019 నుంచి సిద్ధంగా ఉంది. కానీ దాన్ని ఇంత వరకు పార్లమెంటులో ప్రవేశపెట్టలేదు. ఈ బిల్లును తక్షణమే ఆర్డినెన్సు రూపంలో అమల్లోకి తీసుకొచ్చి, తదుపరి జరిగే పార్లమెంటు సమావేశాల్లో చట్ట రూపం తీసుకురావాలి. అప్పుడే హెల్త్‌కేర్ రంగంలో పనిచేసేవారు నిర్భయంగా పనిచేయగల్గుతారు. 05. వైద్య సిబ్బందిపై దాడికి పాల్పడేవారికి కఠిన శిక్షలు: ప్రతిపాదిత బిల్లు లేదా ఆర్డినెన్సులో హెల్త్‌కేర్ సిబ్బందిపై దాడులకు, లైంగిక నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించేలా నిబంధనలు రూపొందించాలి. ఆ నేరాలను నాన్-బెయిలబుల్ నేరాలుగా పరిగణించాలి. ఈ ఐదు ప్రధాన డిమాండ్లను ప్రధాని ముందుంచిన అమ పద్మ అవార్డు గ్రహీతలైన వైద్యులు కొత్త చట్టం తీసుకురావడంతోనే సరిపెట్టకుండా కఠినంగాలు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు కొన్నాళ్ల తర్వాత మర్చిపోవడం పరిపాటిగా మారిపోయిందని అసహనం వ్యక్తం చేశారు. దేశంలోనే అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మ అవార్డులను పొందిన వైద్యులుగా తాము చేస్తున్న విజ్ఞప్తి ఇదొక్కటే అని నొక్కి చెప్పారు. ఈ విషాదం నిజమైన, శాశ్వతమైన మార్పునకు ఉత్ప్రేరకంగా మారాలని, నిర్భయ సహా లైంగిక హింసకు గురైన వారందరినీ స్మరిస్తూ అటువంటి భయానక సంఘటనలు కనీసం ఊహించడానికి కూడా వీల్లేని సమాజాన్ని సృష్టించాలని ఆశించారు.

# ప్రపంచంలోని ఈ 17 దేశాల్లో ఎలాంటి ఆదాయపు పన్ను విధించరు!




దుబాయ్, అబుదాబి తమ పన్ను-స్నేహపూర్వక విధానాలకు ప్రసిద్ధి చెందాయి. ఇక్కడ వ్యక్తిగత ఆదాయపు పన్ను లేదు. ఇది ప్రవాసులు, వ్యాపారవేత్తలకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారుతుంది.

అటువంటి 17 దేశాల గురించి తెలుసుకుందాం

ఆంటిగ్వా, బార్బుడా: సున్నా ఆదాయపు పన్ను, సంపద, మూలధన లాభాలు, వారసత్వంపై మినహాయింపులతో ఆంటిగ్వా, బార్బుడా కూడా అంతర్జాతీయ వ్యాపార కంపెనీలకు 50-సంవత్సరాల పన్ను మినహాయింపును అందిస్తాయి. ఇది ప్రధాన పన్ను స్వర్గధామంగా మారింది. అయినప్పటికీ పరిమిత పన్ను ఒప్పందాలు అంటే విదేశీ పెట్టుబడిదారులు ఇప్పటికీ వారి స్వదేశాలలో పన్నులు చెల్లించవలసి ఉంటుంది. సెయింట్ కిట్స్, నెవిస్: నివాసితులకు ఆదాయం, డివిడెండ్‌లు, రాయల్టీలు లేదా వడ్డీపై పన్నులు లేవు. సెయింట్ కిట్స్, నెవిస్‌లను పన్ను స్వర్గధామం. సుందరమైన ద్వీపాలు పెట్టుబడిదారులను ఆకర్షిస్తాయి. వారు %వి%250,000ం పెట్టుబడితో పౌరసత్వం పొందవచ్చు. వీసా లేకుండా 150ం దేశాలకు ప్రయాణించవచ్చు.

బహ్రెయిన్: బహ్రెయిన్ ఎటువంటి ఆదాయపు పన్నును అందించదు. కార్పొరేట్ పన్నులు చమురు, గ్యాస్ రంగానికి మాత్రమే 46% వర్తిస్తాయి. దాని 10% వ్యాట్, పెట్టుబడి ద్వారా నివాసం కోసం ఎంపిక పన్ను ప్రయోజనాలను కోరుకునే వారికి ఆకర్షణీయంగా ఉంటుంది.

యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్: యుఎఇ వ్యక్తిగత ఆదాయం, మూలధన లాభాలు, వారసత్వం లేదా ఆస్తి పన్నులను విధించదు. ఎఇడి 375,000 కంటే ఎక్కువ సంపాదించే కంపెనీలకు మాత్రమే తక్కువ 9% కార్పొరేట్ పన్నును కలిగి ఉంటుంది. పన్ను ప్రయోజనాలు, ఆధునిక సౌకర్యాలను అందించడం ద్వారా పెట్టుబడి ద్వారా రెసిడెన్సీని పొందవచ్చు.

బహామాస్: దాని వెచ్చని వాతావరణం, విశ్రాంతి జీవనశైలికి ప్రసిద్ధి చెందిన బహామాస్‌కు ఆదాయం లేదా కార్పొరేట్ పన్నులు లేవు, 3% వరకు మాత్రమే టర్నోవర్ పన్ను ఉంటుంది. పెట్టుబడి ద్వారా పౌరసత్వం అందుబాటులో లేనప్పటికీ, రెసిడెన్సీని డాలర్ 750,000+ పెట్టుబడితో సురక్షితం చేయవచ్చు.

బెర్ముడా: ఆదాయం లేదా విలువ ఆధారిత పన్నులు లేకుండా, బెర్ముడా కార్పొరేట్ పన్ను వాటా మూలధన స్థాయిలపై ఆధారపడి ఉంటుంది. అలాగే ఆస్తి పన్ను వార్షిక అద్దె విలువపై ఆధారపడి ఉంటుంది. %వి%2.5ం మిలియన్ల పెట్టుబడి ద్వారా రెసిడెన్సీని పొందవచ్చు. కానీ పౌరసత్వానికి కాదు.

కేమాన్ దీవులు: ఎలాంటి ఆదాయం, కార్పొరేట్ లేదా విలువ ఆధారిత పన్నులు కేమాన్ దీవులను పన్నుల స్వర్గధామంగా మార్చలేదు. 7.5% స్టాంప్ డ్యూటీ వర్తిస్తుంది. పెట్టుబడి ద్వారా పౌరసత్వం అందుబాటులో లేనప్పటికీ, డాలర్ 2.4ం మిలియన్ పెట్టుబడితో రెసిడెన్సీని పొందవచ్చు.

వనాటు: వ్యక్తిగత ఆదాయం, వారసత్వం, మూలధన లాభాలు, మూలధన ఎగుమతులపై ఎటువంటి పన్నులను అందించకుండా, వనాటు %వి%300 వార్షిక రుసుముతో 20 సంవత్సరాల పాటు కార్పొరేట్ పన్నుల నుండి కంపెనీలను మినహాయించింది. %వి%130,000ం పెట్టుబడితో పౌరసత్వం త్వరగా పొందవచ్చు.

మొనాకో: "యూరోపియన్ ప్రముఖుల ఆట స్థలం"గా ప్రసిద్ధి చెందిన మొనాకోకు ఆస్తి పన్నులు లేవు. ఆ1ం మిలియన్ పెట్టుబడి ద్వారా రెసిడెన్సీని అందిస్తోంది. పెట్టుబడి ద్వారా పౌరసత్వం అందుబాటులో లేనప్పటికీ, దాని పన్ను ప్రయోజనాలు, జీవనశైలి చాలా మందిని ఆకర్షిస్తున్నాయి.

సౌదీ అరేబియా: 20% కార్పొరేట్ పన్ను, చమురు ఆదాయంపై 50-85% పన్నుతో సౌదీ అరేబియా కూడా 15% వ్యాట్‌ను విధిస్తుంది. ఆదాయం లేదా మూలధన లాభాల పన్నులు లేకుండా %వి%1.1 మిలియన్ల పెట్టుబడి ద్వారా శాశ్వత నివాసాన్ని పొందవచ్చు.

బ్రిటిష్ వర్జిన్ ఐలాండ్స్: ఈ బ్రిటీష్ ఓవర్సీస్ టెరిటరీ ఆదాయం, మూలధన లాభాలు లేదా విత్‌హోల్డింగ్ పన్నులపై ఎలాంటి పన్నులను విధించదు. పెట్టుబడి ద్వారా నివాసం, పౌరసత్వం ఎంపికలు కానప్పటికీ, ద్వీపాలు స్థిరమైన, పన్ను-స్నేహపూర్వక వాతావరణాన్ని అందిస్తాయి.

టర్క్స్, కైకోస్ దీవులు: ప్రపంచ స్థాయి బీచ్‌లకు ప్రసిద్ధి చెందిన టర్క్స్, కైకోస్ ఆదాయం, మూలధన లాభాలు, ఆస్తి, వారసత్వం లేదా కార్పొరేట్ లాభాలపై పన్నులు విధించరు. ద్వీపాలు యుఎస్ డాలర్‌ను ఉపయోగిస్తాయి. రాజకీయ స్థిరత్వాన్ని అందిస్తాయి కానీ పెట్టుబడి ఆధారిత నివాసం లేదా పౌరసత్వం లేదు.

బ్రూనై: 18.5% కార్పొరేట్ పన్ను, వ్యాట్ లేకుండా, బ్రూనై సాధారణ పన్ను విధానాన్ని అందిస్తుంది. అయితే, పెట్టుబడి ద్వారా నివాసం, పౌరసత్వం అందుబాటులో లేదు.

కువైట్: కువైట్ 15% కార్పొరేట్ పన్ను, విలువ ఆధారిత లేదా ఆస్తి పన్నులు లేకపోవటం వలన అది ఆకర్షణీయంగా ఉంటుంది. అయినప్పటికీ అది పెట్టుబడి ద్వారా నివాసం లేదా పౌరసత్వాన్ని అందించదు.

ఖతార్: ఖతార్ 10% కార్పొరేట్ పన్నును విధిస్తుంది. వ్యాట్ లేదా ఆస్తి పన్నులు లేవు. రెసిడెన్సీ లేదా పౌరసత్వం పెట్టుబడి ద్వారా పొందబడదు. రియల్ ఎస్టేట్ అద్దెలకు లీజు రిజిస్ట్రేషన్ ఫీజులు వర్తిస్తాయి.

సోమాలియా: సోమాలియా పన్ను రహిత వాతావరణాన్ని అందిస్తుంది. అయితే, ఇది సురక్షితం కాదు. పెట్టుబడి ఆధారిత నివాసం లేదా పౌరసత్వం అందుబాటులో లేదు.

వెస్టన్ సహారా: ప్రాదేశిక వివాదాల కారణంగా పన్ను రహితం, పశ్చిమ సహారా నివసించడానికి కూడా సురక్షితం కాదు. పెట్టుబడి ద్వారా నివాసం లేదా పౌరసత్వం కోసం ఎంపికలు లేవు.


# రాజకీయ ప్రకంపనలు రేపుతోన్న ఫైల్స్ దగ్ధం ఇష్యూ.. తెరపైకి ఎన్నో సందేహాలు



ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైల్స్ దగ్ధం ఇప్పుడు కామన్ అయ్యింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వరుస ఘటనలు ఇందుకు నిదర్శనమైంది. మొన్న మదనపల్లి ఇప్పుడు టీటీడీలో ఫైల్స్ దగ్ధం వ్యవహారం ఆసక్తిగా మారింది. రాజకీయ దుమారం రేపుతోంది. ఫైల్స్ దగ్ధం ఘటనల్లో వైసీపీ ని టార్గెట్ చేస్తున్న అన్ని పార్టీల విమర్శలతో వ్యవహారం చర్చగా మారింది. ఒక్కో పార్టీది ఒక్కో విమర్శగా ఫైల్స్ ఫైర్ ఇష్యూ వివాదాస్పదంగా మారింది. సమగ్ర విచారణ కోసం డిమాండ్ చేస్తున్న పార్టీల తీరు పొలిటికల్ హీట్ ను పెంచుతోంది. ఏపీలో ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల దగ్ధం వ్యవహారం రిపీట్ అవుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైల్స్ దగ్ధం కేసు మరవకముందే తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఫైల్స్ దగ్ధం కావడం చర్చగా మారింది. గత నెల 21 అర్ధరాత్రి మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం కేసు రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. సబ్ కలెక్టర్ కార్యాలయంలోని పలు రెవెన్యూ రికార్డులు అగ్నికి ఆహుతి కావడంపై ప్రభుత్వం కూడా సీరియస్ గా స్పందించింది. కేసు విచారణ దర్యాప్తు విషయంలో నేరుగా డీజీపీ కే సీఎం ఆదేశాలు జారీ చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ వ్యవహారంలో ఇప్పటిదాకా 9 కేసులు నమోదు కాగా సిఐడి విచారణ కొనసాగుతోంది. ఘటనలో 2400 ఫైళ్ళు కాలిపోగా దాదాపు 700 పత్రాలు సగం వరకు కాలినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే 32 మందిని ప్రశ్నించిన పోలీసులు 15 మంది అనుమానితులకు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారం రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రెవెన్యూ ఉద్యోగులు, పొలిటికల్ లీడర్లు ఉన్నట్లు గుర్తించిన పోలీసులు ఈమేరకు కేసులు కూడా నమోదు చేశారు. ఇక ఈ ఘటన మరువక ముందే తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలోని ఫస్ట్ ఫ్లోర్‌లో రెండు రోజుల క్రితం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం ఇంజనీరింగ్ విభాగంలో చోటు చేసుకుంది. ఈ నెల 17 న మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఘటన జరగ్గా ప్రమాదం విషయం ఆలస్యంగానే వెలుగులోకి వచ్చింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకునే లోపు మంటలను సిబ్బందే ఆర్పి వేయాగా టిటిడి ఉన్నతాధికారులు కూడా రాత్రి 7 గంటల సమయంలో సమాచారం తెలిసింది. వెలిగించిన దీపం వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు సిబ్బంది చెబుతున్నా అగ్నిప్రమాదం పై మాత్రం పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇప్పటికే టీటీడీలో జరిగిన ఇంజనీరింగ్ పనులపై విజిలెన్స్ విచారణ కొనసాగుతున్న సమయంలో అదే సెక్షన్ లోని ఫైల్స్ అగ్ని ప్రమాదానికి గురికావడం మరింత అనుమానాలకు తావిస్తోంది. అగ్ని ప్రమాదంపై టీటీడీ ఉన్నతాధికారులకు కూడా ఆలస్యంగా తెలియడంతో రాత్రి 9 గంటల సమయంలో టిటిడి పరిపాలన భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనను టిటిడి చీఫ్ విజిలెన్స్, సెక్యూరిటీ అధికారి శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు తో కలిసి పరిశీలించారు. డీఈ ఛాంబర్ లో పాక్షిక అగ్నిప్రమాదం జరిగిందని గుర్తించారు. అయితే ఆ ఫైల్స్ ఇప్పటికే ఈ-ఫైలింగ్ చేసిన ఫైల్స్ గా గుర్తించామని అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నారు. టిటిడి కి చెందిన స్థానిక ఆలయాల ఫైల్స్ గా గుర్తించామని సివీఎస్ఓ తెలిపారు. లోకల్ టెంపుల్స్ లో జరిగిన సివిల్ వర్క్స్ సంబంధించిన ఫైల్స్ పాక్షికంగా దగ్ధమయ్యాయని తేల్చారు. పూర్తిస్థాయి దర్యాప్తు కొనసాగుతుందన్నారు టీటీడీ సీవీఎస్ఓ శ్రీధర్. అయితే టీటీడీలో ఫైల్స్ దగ్ధం వ్యవహారం మాత్రం రాజకీయ దుమారమే రేపుతోంది. కూటమి పార్టీలతో పాటు కాంగ్రెస్ కూడా టిటిడి ఫైల్స్ దగ్ధంపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తోంది. ఈ ఘటనపై జనసేన వినూత్నరీతిలో మీడియా ముందుకు వచ్చింది. జనసేన తిరుపతి ఇంచార్జ్ కిరణ్ రాయల్ విద్యుత్ వైర్లు, దీపాలతో మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దోపిడి నుంచి తప్పించుకునేందుకే విద్యుత్ షార్ట్ సర్క్యూట్, దీపాలకు ఫైల్స్ దగ్ధం అవుతున్నాయని ఆరోపించారు. టిటిడిలో విజిలెన్స్ విచారణ జరుగుతుండగా ఫైల్స్ దగ్ధం కావడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విజిలెన్స్ ఎంక్వయిరీ లో నిజాలు బయటకు వస్తాయనే ఫైల్స్ దగ్ధం చేస్తున్నారనీ, టిటిడిలో భారీ అవినీతి జరిగిందని ఆరోపించారు. టిటిడిలో కొందరు అధికారుల ప్రోద్బలంతోనే ఫైల్స్ దగ్ధం అయ్యాయన్నారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో చేపట్టిన పనులకు సంబంధించిన ఫైల్స్ దగ్ధం చేసినట్లు అనుమానాలు ఉన్నాయన్నారు కిరణ్ రాయల్. ఇక కాంగ్రెస్ కూడా ఫైళ్ల దగ్ధం వ్యవహారంపై విచారణకు డిమాండ్ చేస్తుంది. టీటీడీ లో అగ్ని ప్రమాదం జరగడం విడ్డూరమన్న కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్, టిటిడి పరిపాలనా భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంపై అనుమానాలు ఉన్నాయన్నారు. టీటీడీలో అవినీతిపై ఢిల్లీలో ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు. ఘటనపై వారం రోజుల్లో వాస్తవాలు భక్తుల ముందు పెట్టకపోతే ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని చింతా మోహన్ హెచ్చరించారు. ఇక బిజెపి, టిడిపిలు కూడా టీటీడీ ఫైల్స్ ఫైర్ ఇష్యూపై స్పందించాయి. రెండు నెలల్లో రాష్ట్రంలో పలు చోట్ల 5 అగ్ని ప్రమాదాల ఘటనలు జరిగాయన్న బిజెపి నేతలు అవినీతి, అక్రమాలు బయటపడతాయనే ఫైల్ ను తగలబెడుతున్నారనీ విమర్శించారు. ఫైల్స్ కాల్చినంత మాత్రాన నిందితులు తప్పించుకోలేరన్నారు. రాష్ట్రంలో ఫైళ్ల అగ్ని ప్రమాదం కథపై ఉక్కు పాదం మోపుతామన్నారు. ఏపీలోనే ఎందుకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ప్రశ్నిస్తున్నారు బిజెపి నేతలు. భవిష్యత్తులో వైసీపీ నేతలు జైళ్లకు వెళ్తారన్న భయంతో ఫైల్స్ తగల పెడుతున్నారనీ ఆరోపించారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని, టీటీడీ ఫైళ్ల దహనం ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరపాలని బిజెపి నేతలు భాను ప్రకాష్ రెడ్డి, సామంచి శ్రీనివాస్ లు డిమాండ్ చేస్తుండగా మాజీ సీఎం జగన్ డైరెక్షన్ లోనే ఫైళ్లు కాలిపోతున్నాయని టిడిపి ఆరోపిస్తోంది.

# ప్రభాస్ మూవీ.. ఈ పిల్లతో జాగ్రత్త



పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కబోయే సినిమాని శనివారం గ్రాండ్ గా లాంచ్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించ బోతోంది. 1940 బ్యాక్ డ్రాప్ లో సెకండ్ వరల్డ్ వార్ కి ముందు జరిగిన కథగా ఈ సినిమా ఉండబోతోంది. "ఫౌజీ" అనే టైటిల్ ని ఈ సినిమాని ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. అయితే అధికారికంగా ఇంకా కన్ఫర్మ్ చేయలేదు. సెప్టెంబర్ నుంచి ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుందంట. ఈ చిత్రంలో బ్రిటిష్ ఇండియన్ ఆర్మీ సోల్జర్ గా ప్రభాస్ కనిపిస్తాడంట. పవర్ ఫుల్ యాక్షన్ సీక్వెన్స్ ఉంటాయనే మాట వినిపిస్తోంది. ఈ సినిమాలో హీరోయిన్ గా ఇమాన్వి ఇస్మాయిల్ అనే అమ్మాయిని హను రాఘవపూడి హీరోయిన్ గా కన్ఫర్మ్ చేశారు. ఈ బ్యూటీకి ఇదే మొదటి చిత్రం. అయితే సోషల్ మీడియాలో తన డాన్స్ వీడియోలతో ఇమాన్వి బాగా పాపులర్ అయ్యింది. మంచి డాన్సర్ గా గుర్తింపు తెచ్చుకుంది. కొరియోగ్రాఫర్ కూడా చేస్తోంది. ఈ అమ్మాయి డాన్స్ టాలెంట్ కి చాలా మంది ఫ్యాన్స్ ఉన్నారు. మంచి ఎక్స్ ప్రెషన్స్ తో డాన్స్ పెర్ఫార్మ్ చేస్తూ ఉంటుంది. అయితే ఈ బ్యూటీని హీరోయిన్ గా హను రాఘవపూడి కన్ఫర్మ్ చేయడంతో డార్లింగ్ ఫ్యాన్స్ కొంత టెన్షన్ పడుతున్నారు. ప్రభాస్ హెవీ డాన్సర్ కాదని అందరికి తెలిసిందే. ఏదో చిన్న చిన్న స్టెప్పులతో మ్యానేజ్ చేస్తాడు. ఇమాన్వి డాన్స్, ఎక్స్ ప్రెషన్స్ చూస్తుంటే ప్రభాస్ ని సాంగ్స్ లో డామినేట్ చేసేస్తుందనే అభిప్రాయాన్ని ఫ్యాన్స్ వ్యక్తం చేస్తున్నారు. ప్రభాస్ డాన్స్ చేయకపోయిన పర్లేదు మరీ తేలిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత దర్శకుడు హను చేతిలోనే ఉందని ఫ్యాన్స్ అంటున్నారు. ఒక స్టార్ హీరో పక్కన కొత్త అమ్మాయిని హీరోయిన్ గా హను రాఘవపూడి ఎంపిక చేశారంటే కచ్చితంగా ఆన్ స్క్రీన్ రొమాన్స్ ని పెర్ఫెక్ట్ గా డిజైన్ చేస్తాడనే అభిప్రాయం ఇండస్ట్రీ వర్గాలలో ఉంది. అయితే ఇప్పటి వరకు హను రాఘవపూడి సినిమాలలో హీరోయిన్స్ పాత్రలన్నీ కూడా హీరోలని పెర్ఫార్మెన్స్ పరంగా డామినేట్ చేసే విధంగానే ఉన్నాయని అభిమానులు గుర్తు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా ఇమాన్వి లాంటి టాలెంటెడ్ యాక్టర్ ప్రభాస్ కి జోడీగా నటించడంపై ఫ్యాన్స్ హ్యాపీగా ఫీల్ అవుతున్నారు. అయితే ఆమె ఎక్కడ తమ అభిమాన హీరోని డామినేట్ చేస్తుందా అనే టెన్షన్ పడుతున్నారు. మరి మొదటి సినిమానే ఇండియన్ నెంబర్ వన్ స్టార్ కి జోడిగా నటిస్తోన్న ఇమాన్వి ఏ స్థాయిలో "ఫౌజీ"తో మెప్పిస్తుందనేది వేచి చూడాలి.

# డెబ్యూ మోక్షజ్ఞ పాన్ ఇండియా ట్రయల్?






బాహుబలి, సైరా నరసింహా రెడ్డి, ఆర్.ఆర్.ఆర్, హనుమాన్ .. ఈ సినిమాలన్నిటిలో కామన్ ఎలిమెంట్ 'సూపర్ హీరోయిజం'. సూపర్ హీరోలను తెరపై చూపించి ఔరా! అనిపిస్తున్నారు మన దర్శకులు. ఎంపిక చేసుకున్న పాత్రకు సూపర్ హీరోయిజాన్ని జోడించి భారీ యాక్షన్ కి ఆస్కారం కల్పించడం ద్వారా మాస్ ని పదే పదే థియేటర్లకు రప్పిస్తున్నారు. ఇప్పుడు అదే తీరుగా మోక్షజ్ఞను తెరపై పరిచయం చేసేందుకు హనుమాన్ ఫేం ప్రశాంత్ వర్మ చేస్తున్న ప్రయత్నం ఆసక్తిని కలిగిస్తోంది. నందమూరి నటసింహం బాలకృష్ణ నటవారసుడిని పరిచయం చేయడం అంటే ఆషామాషీనా? సరైన సమయంలో సరైన దర్శకుడితో ముందుకు వెళ్లాలనే బాలయ్య బాబు నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. హనుమాన్ తో పాన్ ఇండియా హిట్టు కొట్టిన ప్రశాంత్ వర్మకు ఈ అవకాశం ఇవ్వాలనే నిర్ణయం సముచితమైనదన్న భావన నందమూరి అభిమానుల్లోను ఉంది. ఒక రెగ్యులర్ మాస్ డైరెక్టర్ చేతికి మోక్షజ్ఞను అందించి ఉంటే కచ్చితంగా అది విమర్శలకు తావిచ్చేది. కానీ బాలయ్య బాబు ఎంతో తెలివిగా మోక్షు ఆరంగేట్ర చిత్రాన్ని ప్లాన్ చేసారు. మొదట్లో ఆదిత్య 369 సీక్వెల్ తీస్తారని, దానికి బాలకృష్ణ డైరెక్టర్ అంటూ ప్రచారం సాగినా, దానికి బ్రేక్ ఇచ్చిన హనుమాన్ తో ట్రెండింగ్ లో ఉన్న దర్శకుడిని ఆశ్రయించడం ఒక గొప్ప ఎత్తుగడగా భావిస్తున్నారు. మోక్షజ్ఞ డెబ్యూ ప్రాజెక్ట్ గురించి ఎప్పటికప్పుడు లీకులు అందుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీదేవి రెండో కుమార్తె ఖుషి కపూర్ కథానాయికగా నటిస్తుందని గుసగుసలు వినిపించాయి. ఖుషి కపూర్ తో చర్చలు సాగుతున్నాయన్న సమాచారం ఉంది.

ఇంతలోనే ఇప్పుడు ఈ సినిమాలో బాలీవుడ్ ప్రముఖ హీరో నటిస్తారని కూడా టాక్ వినిపిస్తోంది. కోలీవుడ్, శాండల్వుడ్ నుంచి పేరున్న స్టార్లను తీసుకునే అవకాశం ఉందంటూ..! మరో గుసగుస వినిపిస్తోంది. హనుమాన్ ఫేం ప్రశాంత్ వర్మ క్రేజీ ప్రాజెక్టుకి ప్రధాన అస్సెట్ కానుండగా, ఖుషి, బాలీవుడ్ హీరో, ఇతర పరిశ్రమల స్టార్లు పాన్ ఇండియా అప్పీల్ తెస్తారని భావిస్తున్నారు. ప్రశాంత్ వర్మ సూపర్ హీరో సినిమాటిక్ యూనివర్స్ లోనే ఈ ప్రాజెక్ట్ కూడా కొనసాగుతుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. భారతీయ పురాణేతిహాసాల నుంచి ఒక ఆసక్తికరమైన పాత్రను తీసుకుని అందులో మోక్షజ్ఞను ప్రవేశ పెడుతున్నారు. అతడిని సూపర్ హీరోగా తెరపై చూపిస్తారు. మోక్షజ్ఞ పాత్రకి గురువు పాత్రలో సీనియర్ బాలీవుడ్ హీరో నటిస్తారని టాక్ వినిపిస్తోంది. ప్రయత్నం బావుంది. అంతకంతకు ఉత్కంఠ పెంచుతోంది. కానీ కెరీర్ ఆరంగేట్రమే భారీ స్పాన్ తో ఉంటే అది డెబ్యూ హీరోకి సవాల్ గా మారే ఛాన్సుంటుందేమో!

# ధూమపానం మానేస్తే... గంటల్లో, రోజుల్లో, నెలల్లో వచ్చే మార్పులివే!






సరదా కోసమో, స్టైల్ కోసమో అలవాటైన ధూమపానం నిజంగా మానేయాలనుకున్నప్పుడు చాలా కష్టం అని అంటుంటారు అనుభవజ్ఞులు! మానెయ్యండి అని చెప్పినంత ఈజీ కాదు ఈ అలవాటు నుంచి బయటపడటం అని చెబుతుంటారు! కానీ... మనసుంటే మార్గం ఉంటుంది, మానాలని దృఢంగా నిర్ణయించుకుంటే మానేయడం ఏమీ అత కష్టం కాదని అంటుంటారు నిపుణులు! అవును... ధూమపానం అలవాటు చేసుకోవడం ఎంత సులువో, మానేయడం అంత కష్టం అని అంటుంటారు. కానీ... నిజంగా ఈ అలవాటు నుంచి బయటపడినవారు మాత్రం ఆ మార్పును స్పష్టంగా అనుభవిస్తుంటారు. మానసి కంగానూ, శారీరకంగానూ ఎంతో మార్పును ఎక్స్ పీరియన్స్ చేయడంతో పాటు.. సరికొత్త లైఫ్ లోకి అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుందని చెబుతుంటారు. వాస్తవానికి ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా కొన్ని మిలియన్స్ మంది ఈ ధూమపానానికి అలవాటైపోయారు. తక్కువమంది మానాలని ప్రయత్నిస్తుంటారు. అతి కొద్ది మాత్రం ఆ అలవాటును మానేస్తుంటారు. ఈ సమయంలో ధూమపానం అలవాటును వదులుకోవడం వల్ల శరీరంలో కలిగే మార్పులు ఎన్నో ఉంటాయి. అవి ఏమిటనేది ఇప్పుడు చూద్దాం..! ధూమపానం మానేసిన 20 నిమిషాల్లో బ్లడ్ ప్రెసర్ (బీపీ) సాధారణ స్థితికి వచ్చేస్తుంది. ఇదే క్రమంలో పల్స్ రేటూ నార్మల్ అయిపోతుంది. అదేవిధంగా కాళ్లు, చేతులు, బాడీ టెంపరేచర్ నార్మల్ స్థితికి వచ్చేస్తుంది. ఇక స్మోకింగ్ మానేసిన 12 గంటల తర్వాత రక్తంలో కార్బన్ మోనాక్సైడ్ స్థాయి సాధారణ స్థితికి వచ్చేస్తుంది. గుండెకు, ఇతర భాగాలకు మరింత ఆక్సిజన్ సరఫరా అవుతుంది. ఇదంతా 12 గంటల్లోనే జరిగిపోతుంది. ఇక






ధూమపానం మానేసిన 24 గంటల్లో హార్ట్ ఎటాక్ రిస్క్ తగ్గగా.. 48 గంటల్లో నర్వ్ ఎండింగ్స్ తిరిగి అభివృద్ధి చెందుతాయి. ఇదే క్రమంలో... తీపి, ఉప్పు తదితర రుచులను ఆస్వాధించే విధానం మరుతుంది.. రుచి బాగా తెలుస్తుంది! ఇక 72 గంటల్లో బ్రాంకియల్ ట్యూబ్స్ రిలాక్స్ అవ్వడంతోపాటూ సులబంగా శ్వాస తీసుకోవచ్చు. ఊపిరితిత్తుల కెపాసిటీ పెరుగుతుంది. ఇక స్మోకింగ్ మానేసిన రెండు వారాల నుంచి మూడు నెలల్లో బ్లడ్ సర్క్యులేషన్ ఇంప్రూవ్ అవుతుంది. నడవడం సులువవుతుంది. లంగ్స్ ఫంక్షనింగ్ 30 శాతం మెరుగుపడుతుంది. ఇదే సమయంలో ఎనర్జీ లెవెల్స్ పెరుగుతాయి. లంగ్స్ లో సీలియా మళ్లీ పెరుగుతుంది. ఫలితంగా ఊపిరితిత్తులు శుభ్రంగా ఉండి, ఇన్ఫెక్షన్ తగ్గుముఖం పడుతుంది. అదే విధంగా మ్యూకస్ ని హ్యాండిల్ చేసే సామర్థ్యం పెరుగుతుంది. ఇలా శరీరంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటాయి. ఇదే క్రమంలో... దూమపానం మానేసిన కొన్ని నెలల తర్వాత అంగస్తంభన సమస్య నుంచి విముక్తి లభించే అవకాశం ఉంది.

ధూమపానం మానేసిన తర్వాత ఏడాది లోపు ప్రారంభంలో 10 - 15 నిమిషాలు నడవడానికి ఇబ్బంది పడేవారి సమస్య తగ్గుతుంది.. ఆయాసం తగ్గుతుంది. ఇక ధూమపానం మానేసిన నాలుగేళ్ల తర్వాత అసలు ఆ అలవాటు లేని వ్యక్తిలా మారిపోతారు!




# సుధీర్ బాబు జటాధర.. పాన్ ఇండియా రేంజ్ లోనే..





టాలీవుడ్ టాలెంటెడ్ హీరో సుధీర్ బాబు తన కెరీర్ లో మరో బిగ్గెస్ట్ మూవీతో సిద్ధమవుతున్నాడు. తన లుక్స్ ఫిట్నెస్ తో తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్న సుధీర్, ఇప్పుడు పాన్-ఇండియా స్థాయిలో తెరకెక్కబోతున్న జటాధర అనే చిత్రం ద్వారా మరోసారి ప్రేక్షకులను మంత్ర ముగ్దులను చేయబోతున్నాడు. ఈ సినిమాతో సుధీర్ బాబు సూపర్ నేచురల్ ఫాంటసీ ప్రపంచంలోకి అడుగుపెడుతున్నాడు. ప్రసిద్ధ నిర్మాత ప్రేరణ అరోరా, శివిన్ నారంగ్ తో కలిసి నిర్మిస్తున్న ఈ సినిమా తెలుగులోనే కాకుండా హిందీ భాషలో కూడా రూపొందనుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్ ఇటీవలే విడుదల కాగా, అది సోషల్ మీడియాలో మంచి హల్ చల్ చేసింది. సుధీర్ బాబు త్రిశూలం పట్టుకొని, లార్డ్ శివా ఛాయాచిత్రం ముందు శరీర సౌష్టవం ప్రదర్శిస్తూ ఉన్న లుక్ అద్భుతంగా ఆకట్టుకుంటోంది. ఈ లుక్ చూసిన అభిమానులు మరింత అంచనాలు పెంచుకుంటున్నారు. జటాధర సినిమాను ఒక సాధారణ చిత్రం కాకుండా, తెలుగు సినీ పరిశ్రమతో పాటు బాలీవుడ్‌లో కూడా ఒక పెద్ద విజయాన్ని సాధించేలా రూపొందిస్తున్నారు. ఈ సినిమా సుప్రీం స్టార్ హోదాలో సుధీర్ బాబుకు ప్రత్యేక గుర్తింపునిస్తుంది అని అంటున్నారు. అలాగే, బాలీవుడ్ నుంచి ఒక ప్రముఖ హీరోయిన్ ఈ చిత్రంలో కీలక పాత్రలో నటిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. సినిమాలో ప్రతినాయక పాత్రను ఒక %ూ% లిస్టర్ హీరో చేయనున్నట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే, అభిమానుల్లో ఉన్న ఆసక్తి మరింత పెరిగింది. సుధీర్ బాబు సాలిడ్ ప్రెజెన్స్, స్టార్ కాస్ట్ కాంబినేషన్ తో ఈ ప్రాజెక్ట్ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. సినిమా నిర్మాత ప్రేరణ అరోరా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఆమె గతంలో "రుస్తమ్," "టాయిలెట్: ఏక్ ప్రేమ్ కథ," "ప్యాడ్ మాన్," "పరి" వంటి చిత్రాలను నిర్మించి, విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు జటాధర తో ఆమె మరింతగా ప్రేక్షకులను అలరించబోతున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు కూడా జెట్ స్పీడ్ లో జరుగుతున్నాయి. హైదరాబాదులోని ప్రధాన లొకేషన్లలో చిత్రీకరణ త్వరలోనే ప్రారంభం కానుంది. ఇప్పటికే ముంజ్యా, స్త్రీ, కాంతారా వంటి సంచలన చిత్రాలు ఇండియన్ సెన్సేషన్ గా నిలిచాయి. ఇప్పుడు జటాధర ఆ స్థాయిని మించి డిఫరెంట్ కంటెంట్ తో ప్రేక్షకులను కట్టిపడేయడానికి వస్తోంది. ఈ సినిమాను 2025 మహాశివరాత్రి సందర్భంగా గ్రాండ్‌గా విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.